www.prajasakti.com

# ప్రజాశక్తి

మంగళవారం 29 ఆగస్టు 2023

## నేటి నుంచి పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ

**భీమవరం** : జిల్లాలోని గ్రేడ్-1, గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులు 359 మందికి నాలుగు బ్యాచ్‌లుగా ఆరు అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి మల్లికార్జునరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఒక్కో బ్యాచ్‌కు మొత్తం ఆరు రోజులు రెసిడెన్షియల్ ట్రైనింగ్ ఏలూరు జిల్లాలో అందించనున్నట్లు తెలిపారు. ఈ నెల 29 నుంచి వచ్చేనెల 30వ తేదీ వరకూ శిక్షణ ఉంటుందని తెలిపారు. గ్రామ పంచాయతీ పరిపాలనకు సంబంధించి మొత్తం ఆరు అంశాలపై ఈ శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. గ్రామాలలో కొత్తగా లేఅవుట్ల ఏర్పాటుకు అమలులో ఉన్న నిబంధనలతో పాటు పరిపాలనకు సంబంధించిన ఆరు అంశాలపై శిక్షణ ఇవ్వనున్నామని పేర్కొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం ఎస్ఐఆర్‌డి, ఉభయగోదావరి జిల్లాల కలెక్టర్ల పర్యవేక్షణలో జిల్లా పరిషత్ సిఇఒ ఆధ్వర్యంలో జరగనుందని పేర్కొన్నారు.

చెరువుగట్టుకు గండికొడుతున్న నేతలు

# దోసపాడు భూపోరు.. ఉధృతం..!

**వ్యకాస ఆధ్వర్యాన చెరువు గట్టుకు గండి, చేపలు పట్టి నిరసన**

**మద్దతుగా కదిలొచ్చిన సిఐటియు, రైతుసంఘాల నేతలు**

**మా భూములు మాకివ్వాలంటూ నినాదాల హోరు**

**ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, అర్బన్**

ఏలూరు జిల్లాలోని దెందులూరు మండలం దోసపాడు భూపోరాటం ఉధృతమైంది. వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ ఆధ్వర్యంలో భూబాధితులు సోమవారం కదంతొక్కారు. చేపల చెరువులో చేపలు పట్టి, గట్టుకు గండికొట్టి నిరసన తెలిపారు. దీనికి సిఐటియు, రైతుసంఘాల నాయకులు మద్దతు తెలుపుతూ కదలివచ్చారు. భూపోరాటానికి చేరింది. దోసపాడు గ్రామంలో దళితులకు సంబంధించిన వందెకరాలకుపైగా అసైన్డ్ భూములను బడాబాబులు ఆక్రమించి ఆ భూముల్లో చేపల చెరువులు తవ్వి 20 ఏళ్లకుపైగా అనుభవిస్తున్నారు. చట్టప్రకారం అసైన్డ్ భూములు అమ్మకం, కొనుగోళ్లు చెల్లవు. అప్పట్లో తమ అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని తమ భూములు కాజేశారని బాధితులు వాపోతున్నారు. సెంటుభూమి కూడా లేకుండా ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'మా భూములు మాకివ్వండి' అంటూ తహశీల్దార్, ఆర్‌డిఒ, జిల్లా కలెక్టర్, ఎంఎల్‌ఎ వరకూ సమస్యను తీసుకెళ్లారు. పోరాటంలో పాల్గొంటున్న దళితులను పోలీసులతో బెదిరించి, కేసులు పెట్టి దారికి తెచ్చుకోవాలని పెత్తందారులు చూశారు. బాధితులు ఏమాత్రం తగ్గకపోవడంతో సమస్యను పరిష్కరిస్తామంటూ కాలం వెళ్లదీస్తున్నారు. అనేకసార్లు ధర్నాలు, ఆందోళనలు నిర్వహించినా ప్రభుత్వం పట్టించుకోని పరిస్థితి. దీంతో ఓపిక నశించిన బాధితులు చెరువులకు గండికొట్టాలని నిర్ణయించుకున్నారు. జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నడుం బిగించారు. ఈ కార్యక్రమానికి ఢిల్లీ నుంచి వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ విచ్చేశారు. ఆయన ఆధ్వర్యంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎస్.మహంకాళిరావు, పెద్దఎత్తున బాధిత రైతులు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. వలలు వేసి చేపలు పట్టి, గట్టుకు గండికొట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ ఇప్పటి వరకూ శాంతియుతంగా పోరాటం చేశామని, ఇక చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని పోరాటం సాగిస్తామని స్పష్టం చేశారు. అందులో భాగంగానే ఈ రోజు గండ్లు కొట్టడం జరిగిందన్నారు. దోసపాడు దళితులకు వెంటనే వారి భూములు అప్పగించాలన్నారు. సమస్యను పరిష్కరించకపోతే అఖిల భారత స్థాయికి సమస్యను తీసుకువెళ్తామన్నారు. అసైన్డ్ చట్టంలో మార్పులు చేసి పేదల భూములను జగన్ భూస్వాములకు కట్టబెట్టాలని చూడటం దారుణమన్నారు. ఇప్పటికైనా జగన్ పేదల పక్షమా.. భూస్వాముల పక్షమా తేల్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బాధిత రైతులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# పామాయిల్ రైతులకు అండగా ఉంటాం

- ఆయిల్‌పామ్ రీసెర్చ్ సెంటర్ బలోపేతానికి కృషి
- చింతలపూడి రైతులకు పరిహారం అందించి, ప్రాజెక్టు పూర్తి చేస్తాం
- రైతుల బాధలు పట్టని ఎంపీ, ఎంఎల్‌ఎ
- యువగళం పాదయాత్రలో నారా లోకేష్

**ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, చింతలపూడి**

అభివాదం చేస్తున్న నారా లోకేష్

టిడిపి అధికారంలోకొచ్చాక పామాయిల్ రైతులకు అండగా ఉంటామని, సబ్సిడీపై యంత్రాలు, ఉచితంగా మొక్కలు అందించడంతోపాటు, పామాయిల్ బోర్డు ఏర్పాటుకు కృషి చేస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తెలిపారు. సోమవారం 197వ రోజు యువగళం పాదయాత్ర చింతలపూడి నియోజకవర్గంలో సాగింది. సుందరరావు పేటలో ప్రారంభమై లింగపాలెం, జూబ్లీనగర్, వెలగపల్లి, ఫాతిమాపురం, చింతలపూడి మీదుగా శీగేపంచ గ్రామం వరకూ సాగింది. రాత్రికి అక్కడ బస చేశారు. జనం పెద్దఎత్తున తరలిరావడంతో రోడ్లన్నీ కిక్కిరిసిన పరిస్థితి నెలకొంది. అడుగడుగునా ఘనస్వాగతం పలికారు. పాదయాత్రలో లోకేష్‌ను కలిసిన లింగపాలెం గ్రామస్తులు, చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ బాధిత రైతులు, చింతలపూడి నగర పంచాయతీ ప్రజల సమస్యలపై వినతిపత్రాలు అందించారు. చింతలపూడిలో పామాయిల్ రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలోనూ లోకేష్ మాట్లాడారు. పామాయిల్ రైతులకు జగన్ చేసింది సున్నా అన్నారు. పామాయిల్ రైతులకు గిట్టుబాటు ధర రావడం లేదని, వైసిపి ప్రభుత్వం, ఎంపీలు, ఎంఎల్‌ఎలు పట్టించుకోవడం లేదన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే పామాయిల్ రీసెర్చ్ సెంటర్‌ను బలోపేతం చేస్తామన్నారు. ఇతర దేశాల్లో మాదిరిగా రికవరీ శాతం వచ్చేలా అన్ని చర్యలు చేపడతామన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే కొత్త పామాయిల్ ఫ్యాక్టరీ పెట్టి రికవరీ రేటును పెంచేలా చర్యలు తీసుకుంటామన్నారు. అధికారంలోకి వచ్చేది టిడిపి అని, కేంద్రంలో కూడా టిడిపి మద్దతిచ్చే పార్టీనే అధికారంలోకి వస్తుందని తెలిపారు. సబ్సిడీపై డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు, యంత్రాలు అందిస్తామన్నారు. మిషన్ మోడల్ ఆయిల్‌పామ్ పంటను ప్రోత్సహిస్తామన్నారు. రైతు కళ్లలో ఆనందమే టిడిపి లక్ష్యమన్నారు. పామాయిల్ పెట్టుబడి తగ్గించి గిట్టుబాటు ధర వచ్చేలా టిడిపి బాధ్యత తీసుకుంటుందన్నారు. పామాయిల్ బోర్డు ఏర్పాటు చేయాలన్న ఆలోచన ఉందన్నారు.

**సమస్యలపై జనం వినతులు**

చింతలపూడి నగర పంచాయతీలో రోడ్లు, డ్రెయినేజీలు అస్తవ్యస్తంగా ఉన్నాయని, సిసి రోడ్లు ఆధునీకరించి, యువతకు పరిశ్రమలు పెట్టి ఉద్యోగాలు కల్పించాలని, తాగునీటి పైప్‌లైన్ కలుషితమవుతుందని, కొత్త పైప్‌లైన్ వేయాలని, చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి రైతులను ఆదుకోవాలని, శ్మశాన వాటికలకు రక్షణ గోడ నిర్మించాలని, చింతలపూడి బస్సు డిపో ఏర్పాటు చేయాలని పలు సమస్యలను వినతిపత్రంలో ప్రస్తావించారు. చింతలపూడి ప్రాజెక్టు బాధిత రైతులు కలిసి ఎకరానికి రూ.30 లక్షలు ఇస్తామని ప్రస్తుత ఎంఎల్‌ఎ, ఎంపీ ప్రతిపక్షంలో ఉండగా పోరాటం చేసి ప్రస్తుతం పట్టించుకోవడం లేదన్నారు. మా భూముల్లో 22ఎ పరిధిలో పెట్టడంతో భూములు అమ్ముకోవడంగాని, తాకట్టు పెట్టుకోవడం కూడా చేయలేకపోతున్నామని చెప్పారు. టిడిపి అధికారంలోకొచ్చాక న్యాయం చేయాలన్నారు. లింగపాలెం గ్రామస్తులు వినతిపత్రంలో పలు సమస్యలను ప్రస్తావించారు. గ్రామంలో రహదారుల పరిస్థితి అస్తవ్యస్తంగా ఉందని, చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేయాలని, రైతులకు గతంలో ఇచ్చిన సబ్సిడీ పథకాలు పునరుద్ధరించాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. ప్రజల సమస్యలపై లోకేష్ మాట్లాడారు. పామాయిల్ రైతుల సమస్యలతో సతమతమవుతున్నా స్థానిక ఎంపీ పట్టించుకోవడం లేదని, వస్తున్నాం, వెళ్తున్నాం అన్నట్లు వ్యవహరిస్తున్నారని లోకేష్ విమర్శలు గుప్పించారు. ఎంఎల్‌ఎ గురించి మాట్లాడటం అనవసరం అని వ్యాఖ్యానించారు.

**చింతలపూడిలో మరోసారి ఉద్రిక్తత**

లోకేష్ యువగళం పాదయాత్రలో వైసిపి కవ్వింపు చర్యలు కొనసాగాయి. జగనన్న సువేశ్వాలి అంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతోపాటు చింతలపూడి వైసిపి కార్యాలయం వద్దకు యాత్ర చేరుకోగానే జై జగన్ అంటూ వైసిపి కార్యకర్త ఒకరు నినాదాలు చేయడంతో టిడిపి కార్యకర్తలు ద్వ్యాన్స్ చేశారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు రంగ ప్రవేశం చేసి పరిస్థితిని చక్కదిద్దారు.

**నేడు పాదయాత్ర ఇలా**

మంగళవారం ఉదయం ఎనిమిది గంటలకు శీగేవంచ నుంచి పాదయాత్ర ప్రారంభమై పోలవరం నియోజకవర్గంలోకి ప్రవేశిస్తుంది. టి.నరసాపురం, గురవాయిగూడెం, వేపుగుంట, శ్రీరామవరం, తిరుమలదేవిపేట, వెంకటాపురం, బొర్రంపాలెం శివారు వరకు కొనసాగనుంది.

వినతులు స్వీకరించి మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

# స్పందన సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి

## జిల్లా కలెక్టర్ ప్రశాంతి

**ప్రజాశక్తి - భీమవరం**

స్పందన సమస్యలను సంతృప్తి కలిగేలా శాశ్వత పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలలా అర్జీదారుల నుంచి వచ్చిన 235 దరఖాస్తులను కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ స్పందన దరఖాస్తులు మరలా రీఓపెన్ అవ్వని విధంగా కచ్చితమైన పరిష్కారం చూపాలన్నారు. మండలస్థాయిలో స్పందన కార్యక్రమాన్ని అత్యంత బాధ్యతతో నిర్వహించాలన్నారు. సుదూర ప్రాంతాల నుండి మనపై నమ్మకంతో వారి సమస్యల పరిష్కారానికి వస్తారని, దీన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు స్నేహ పూరిత వాతావరణంలో త్వరితగతిన పరిష్కారం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ కె.కృష్ణవేణి. జిల్లా పరిషత్ సిఇఒ కె.రవికుమార్, గృహ నిర్మాణ శాఖ పీడీ ఆర్‌సి ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

**సమస్యలు ఏకరువు..**

తనకున్న రెండు సెంట్ల భూమిలో కష్టపడి ఇల్లు కట్టు కున్నానని, తన కుమారుడు ఇంటి నుండి బయటకు గెంటేశాడని, తన ఇల్లు తనకు ఇప్పించాలని పాలకోడేరు మండలం విస్సా కోడేరు గ్రామానికి చెందిన దిగుమతి సత్యనారాయణ అధికారులకు ఫిర్యాదు చేశారు. భర్త, అత్త మామలు, ఆడపడుచు తనను, తన బిడ్డను ఇంబ్బందులు పెడుతున్నారని రక్షణ కల్పించాలని పెనుగొండ మండలం వడలి గ్రామానికి చెందిన చిటికెన లక్ష్మీరాజేశ్వరి ఫిర్యాదులో కోరింది.

# విద్యాభివృద్ధికి విద్యాదీవెన దోహదం

**ప్రజాశక్తి - భీమవరం**

విద్యాభివృద్ధికి జగనన్న విద్యాదీవెన ఎంతో దోహదపడుతుందని, ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ప్రయోజకులు కావాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. చిత్తూరు జిల్లా నగరిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి విద్యా దీవెన నిధులను బటన్ నొక్కి విద్యార్థుల తల్లుల ఖాతాలో సోమవారం జమ చేశారు. భీమవరం కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ప్రశాంతితో పాటు జిల్లా సాంఘిక సంక్షేమాధికారి శోభారాణి, వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి జివిఆర్‌కెఎస్ఎస్.గణపతిరావు, గిరిజన సంక్షేమాధికారి డి.పుష్పరాణి హాజరై ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలోని 31,188 మంది ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఇబిసి, ముస్లిం, కాపు, క్రిస్టియన్ విద్యార్థులకు విద్యాదీవెన పథకం కింద రూ.25.53 కోట్లు విడుదలయ్యాయని తెలిపారు. ఏప్రిల్ నుంచి జూన్ త్రైమాసికానికి సంబంధించి 14,451 మంది బిసి విద్యార్థులు, 5,434 మంది ఎస్‌సి, 2,876 మంది ఇబిసి, 7,238 మంది కాపు, 171 మంది ఎస్‌టి, 328 మంది ముస్లిం, 690 మంది క్రిష్టియన్ విద్యార్థులకు మొత్తం రూ.23.53 కోట్లు జమ చేసినట్లు పేర్కొన్నారు.

**నియోజకవర్గాల వారీగా..**

ఆచంట నియోజకవర్గంలో 4,622 మందికి రూ.3.16 కోట్లు, భీమవరంలో 4,732 మందికి రూ.3.80 కోట్లు, నరసాపురంలో 3,765 మందికి రూ.2.69 కోట్లు, పాలకొల్లులో 3,784 మందికి రూ.2.77 కోట్లు, తాడేపల్లిగూడెంలో 4,666 మందికి రూ.3.77 కోట్లు, తణుకులో 5,254 మందికి రూ.4.01 కోట్లు, ఉండిలో 4,365 మందికి రూ.3.30 కోట్లు నగదు జమ కానుందని తెలిపారు.

# 30న ఆకాశాన అద్భుతం : జెవివి

**ప్రజాశక్తి - ఉండి**

ఆకాశంలో అప్పుడప్పుడూ అద్భుతాలు జరుగుతూనే ఉంటాయి. చల్లటి వాతావరణాన్ని అందించే చంద్రుడు ఒక్కోసారి మన నెత్తిపైకి వచ్చాడా అన్నట్లు అనిపిస్తుంది. ఏటా చంద్రుడు కొన్ని ప్రత్యేక రోజుల్లో భూమికి అతి దగ్గరగా వస్తూ ఉంటాడు. అలా వచ్చినప్పుడు సూపర్ మూన్ అని అంటారు. ఈ నెల 30వ తేదీ బుధవారం ఆకాశంలో ఒక అద్భుతం చోటు చేసుకోనుందని జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకుడు గాదిరాజు రంగరాజు తెలిపారు. ఆ వివరాలను సోమవారం ఆయన విలేకరులకు తెలిపారు. బుధవారం సూర్యాస్తమయం తర్వాత భూమికి ఆగ్నేయంగా ఈ అద్భుత దృశ్యాన్ని చూడొచ్చన్నారు. సూపర్ మూన్ భూమి నుంచి చంద్రుడుకు 2 లక్షల 24 వేల 895 మైళ్ల దూరంలో ఉంటాడని, సాధారణంగా వేసవి తరువాత వచ్చే వర్షాకాలంలో సంభవించే ఇలాంటి అరుదైన దృశ్యాన్ని మనం సాధారణంగా చూడలేమని తెలిపారు. ఆగస్టు 1వ తేదీన వచ్చిన దాన్ని సర్జన్ మూన్ అంటారని తెలిపారు. ప్రస్తుతం కనిపించేది బ్లూ మూన్ అని, సెప్టెంబర్ 29న హార్వెస్ట్ మూన్, అక్టోబర్ 28న అండర్ మూన్, నవంబర్ 27న బేవర్ మూన్, డిసెంబర్ 26న కూల్ మూన్, కనిపించనున్నాయని తెలిపారు. మరలా 2037 వరకు జరగదని ఖగోళ శాస్త్రవేత్తలు చెబుతున్నారన్నారు. ఈ అద్భుత దృశ్యాలను తప్పక చూడాలని రంగరాజు కోరుతున్నారు.

# విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో పోరాటాలు

భీమవరంలో విద్యుత్ అమరవీరులకు నివాళులర్పిస్తున్న బలరాం, నేతలు

**ప్రజాశక్తి - భీమవరం**

విద్యుత్ అమరవీరుల త్యాగ స్ఫూర్తితో మరిన్ని ప్రజా పోరాటాలు నిర్వహించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం పిలుపునిచ్చారు. స్థానిక మెంటేవారితోటలోని పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో విద్యుత్ అమరవీరుల స్మారక సభ సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బలరాం మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వ హయాంలో విద్యుత్ ఛార్జీల పెంపునకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున వామపక్షాలు ఉద్యమం చేశాయని గుర్తు చేశారు. లక్షలాది మంది ప్రజలు ఈ ఉద్యమంలో పాల్గొన్నారన్నారు. ఈ ఉద్యమాన్ని అణచివేయడానికి టిడిపి ప్రభుత్వం ఆగస్టు 28న బషీర్‌బాగ్‌లో ఉద్యమంపై నిర్బంధాన్ని ప్రయోగించి, కాల్పులు జరిపిందన్నారు. ఈ కాల్పుల్లో విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామి, లాఠీ ఛార్జిలో పదిరోజుల అనంతరం రామకష్ణ అమరులయ్యారన్నారు. ఈ ఉద్యమం అనంతరం ప్రభుత్వం తప్పనిసరిగా విద్యుత్ ఛార్జీలు తగ్గించాల్సి వచ్చిందన్నారు. దాని ఫలితమే టిడిపి పదేళ్లు అధికారానికి దూరమైందన్నారు. ఆ అమరవీరుల స్ఫూర్తితో ఇప్పటికీ ఉమ్మడి రాష్ట్రంలో ఉద్యమాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. జగన్ పాదయాత్ర సందర్భంగా విద్యుత్ ఛార్జీలు పెంచబోనని, తగ్గిస్తానని హామీ ఇచ్చారని, ఈ నాలుగేళ్లలో విద్యుత్ ఛార్జీలు పెంచారని విమర్శించారు. ట్రూఅప్ ఛార్జీలు, ఇతర ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఛార్జీలు తగ్గించకపోతే 2000 విద్యుత్ ఉద్యమ స్ఫూర్తితో మరో పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.వైకుంఠరావు, పట్టణ నాయకులు త్రిమూర్తులు, డేగల నాగు, బంగారు వరలక్ష్మి, రమేష్, ఒడుగు వెంకటేశ్వరరావు, రాంబాబు, వరలక్ష్మి, నజీర్, శ్రీను పాల్గొన్నారు.

**తాడేపల్లిగూడెం** : సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్ పోరాట అమరవీరుల సంస్మరణ సభ సోమవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో జవ్వాది శ్రీను అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి మున్నూరు భాస్కరయ్య, సిపిఎం పట్టణ కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ముందుగా రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామి చిత్రపటానికి భాస్కరయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం భాస్కరయ్య, కర్రి నాగేశ్వరరావు మాట్లాడారు. ఎన్నికల ముందు విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తామన్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తగ్గించకపోగా, పెంచారని తెలిపారు. విద్యుత్ ఛార్జీలను వ్యతిరేకించే ప్రజలందరూ సిపిఎం నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, మడకా రాజు, నరమాల కృష్ణ, చిటికిన రాము పాల్గొన్నారు.

**ఉండి** : పెంచిన విద్యుత్ బిల్లులను తగ్గించకపోతే టిడిపికి పట్టిన గతే వైసిపికి పడుతుందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సోమవారం మహాదేవపట్నంలో పార్టీ మండల కార్యదర్శి ధనకొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బషీర్బాగ్ పోలీస్ కాల్పులు లాఠీఛార్జికి బలైన విద్యుత్ పోరాట అమరవీరులు సత్తెనపల్లి రామకృష్ణ, బాలస్వామి, విష్ణువర్ధన్ రెడ్డికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ 2000 ఆగస్టు 28న అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరంకుశ పాలనలో హైదరాబాద్

తాడేపల్లిగూడెంలో..

నడిబొడ్డున పోలీస్ తుపాకి గుళ్లకు ముగ్గురు నేలకొరిగారన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం విద్యుత్ రంగంలో సంస్కరణలు ఉపసంహరించి, ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వీరవల్లి మాధవరావు, జుత్తిగ సత్యనారాయణ, పంపన మహంకాళి, వి.శ్రీనివాస్, శీలబోయిన శ్రీనివాస్, నాగరాజు, సత్తిబాబు, గెద్దా వెంకటేష్, సూరిబాబు పాల్గొన్నారు.

**పాలకొల్లు** : విద్యుత్ ఉద్యమ అమరవీరులకు సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నివాళులర్పించారు. విద్యుత్ అమరవీరుల సంస్మరణ దినం పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంఎల్‌ఎ దిగుపాటి రాజగోపాల్ మాట్లాడుతూ వినాశకర విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ప్రస్తుతం వస్తున్న విద్యుత్ బిల్లులతో ప్రజలు బిత్తర పోతున్నారన్నారు. విద్యుత్ భారాలు తగ్గించాలని డిమాండ్ చేశారు. తొలుత విద్యుత అమరుల చిత్ర పటాలకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాసరావు, చల్లా సోమేశ్వరరావు, వై.కృష్ణారావు, వలవల శ్రీరామ్మూర్తి, తిరుమాని శ్రీనివాస్, పురుషోత్తమ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

**పెనుగొండ** : విద్యుత్ పోరాటంలో అమరులైన రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామి చిత్రపటాలకు సిపిఎం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను నిరసిస్తూ ఈ నెల 30 నుండి సెప్టెంబర్ 4 వరకూ జరిగే సమరభేరి ఉద్యమంలో ప్రజలందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు షేక్ పాదుషా, మాదాసు నాగేశ్వరరావు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

**పోడూరు** : విద్యుత్ ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరుల చిత్రపటాలకు సిపిఎం నాయకులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కేతా.గోపాలన్, మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్, బురాబత్తుల వెంకటరావు, బొంతు శ్రీను పాల్గొన్నారు.

**నరసాపురం టౌన్** : వేములదీవి గొందిమూల సెంటర్లో సిపిఎం ఆధ్వర్యంలో విద్యుత్ అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం మాట్లాడుతూ బషీర్‌బాగ్‌లో జరిగిన విద్యుత్ ఉద్యమంలో సిపిఎం కార్యకర్తలు బాలస్వామి, రామకృష్ణ విష్ణువర్ధన్ ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. అప్పటి టిడిపి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను పెంచిన సందర్భంగా ప్రజానీకం పెద్ద ఎత్తున విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని రోడ్లపైకొచ్చి అనేక ఉద్యమాలు పోరాటాలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రస్తుత వైసిపి విద్యుత్ భారాలను మోపుతూ ప్రజా వ్యతిరేక విధానాలను మూటగట్టుకుంటుందని విమర్శించారు. తక్షణం భారాలను తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యుత్ బిల్లుల కాపీలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కవురు పెద్దిరాజు, ముచ్చర్ల త్రిమూర్తులు, జెక్కంశెట్టి సత్యనారాయణ, బి.జార్జి, ఎం.రామాంజనేయులు, రాము, శ్రీరామ చంద్రుడు పాల్గొన్నారు.

**యలమంచిలి** : విద్యుత్ ఉద్యమంలో బషీర్‌బాగ్‌లో ఆనాటి టిడిపి ప్రభుత్వ దమన కాండలో ప్రాణాలర్పించిన అమరవీరులు రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామికి చించినాడలో సిపిఎం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాతిరెడ్డి జార్జి, మాసవరపు సుబ్బారావు, దేవ సుధాకర్, గొల్ల ఏడుకొండల శ్రీనివాస్, విప్పర్తి రమేష్, మురాల రత్నప్రసాద్, గొల్ల పెద్దిరాజు పాల్గొన్నారు.

**భీమవరం రూరల్** : విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో రానున్న కాలంలో విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని సిపిఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. వెంపలోని కొత్తపేటలో విద్యుత్ అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జి.మంగమ్మ, లీల, లక్ష్మీదుర్గ పాల్గొన్నారు.

**ఆకివీడు** : ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని కోరుతూ త్వరలో దేశ వ్యాప్తంగా ఉద్యమం చేపడుతున్నట్లు సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బొక్కా సత్యనారాయణ అన్నారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో సోమవారం విద్యుత్ అమరవీరుల చిత్రపటాలకు నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ, పట్టణ కార్యదర్శి తవిటినాయుడు మాట్లాడారు. కార్యక్రమంలో పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

**తణుకు రూరల్** : విద్యుత్ అమరవీరుల పోరాట స్ఫూర్తితో విద్యుత్ భారాలు తగ్గించాలని సిపిఎం పోరాడుతోందని పట్టణ కార్యదర్శి పివి.ప్రతాప్ అన్నారు. స్థానిక అమరవీరుల భవనంలో విద్యుత్ అమరవీరుల సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా సిపిఎం పోరాటం చేస్తోందన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు గార రంగారావు, ఎ.అజయకుమారి, కామన మునిస్వామి, పి.దక్షిణామూర్తి, పిఎల్.నర్సింహారావు, వి.వెంకటేశ్వరరావు, బంగారమ్మ, శారద పాల్గొన్నారు.

# రోడ్డు నిర్మించాలని సిపిఎం పాదయాత్ర

**ప్రజాశక్తి - పెనుమంట్ర**

రహదారి నిర్మాణం చేపట్టాలని పాదయాత్ర చేస్తున్న నాయకులు

పొలమూరు మెయిన్ రోడ్డు నుంచి చెన్నాడచెరువు ఆర్అండ్‌బి రహదారి నిర్మాణం చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ డిమాండ్ చేశారు. రహదారి నిర్మాణం చేపట్టాలని పొలమూరు మెయిన్ రోడ్డు నుంచి చెన్నాడచెరువు వరకూ గ్రామ శాఖ ఆధ్వర్యంలో సోమవారం పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా కేతా గోపాలన్ మాట్లాడుతూ వెంటనే గోతులను పూడ్చాలన్నారు. ఈ రహదారి గుండా ప్రయాణించలేక రైతులు, ప్రజలు నానా అవస్థలు పడుతున్నారన్నారు. దీనికితోడు వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయన్నారు. సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కూసంపూడి సుబ్బరాజు, మండల కమిటీ సభ్యులు కేతా పద్మజ, బత్తుల విజయ్ కుమార్, పొలమూరు శాఖ కార్యదర్శి రాపాక ఆశీర్వాదం, చింతపల్లి తిరుమల, కట్టా సత్యనారాయణ, గుమ్మడి లక్ష్మి నరసింహరాజు పాల్గొన్నారు.

# శ్మశాన స్థలంగా రెండెకరాలు కేటాయించాలి

## కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్రాంతిబాబు

**ప్రజాశక్తి - భీమవరం**

అర్ధవరంలోని దళితపేటకు శ్మశానవాటికకు రెండెకరాలు కేటాయించాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతి బాబు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్లో జరిగిన స్పందన కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చిన్నం చిన్న నాగేశ్వరరావుతో కలిసి డిఆర్ఒ కృష్ణవేణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా క్రాంతిబాబు మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 76 ఏళ్లు పూర్తి చేసుకున్నా నేటికీ దళితులు వివక్ష ఎదుర్కొంటూనే ఉన్నారన్నారు. రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగినా సామాజికంగా దళితులపై నేటికీ కుల వివక్ష అంటరానితనం ప్రత్యక్షంగా పరోక్షంగా కొనసాగుతోందన్నారు. గణపవరం మండలం అర్ధవరం గ్రామం దళితపేటలో సుమారు 600 దళిత కుటుంబాలు నివసిస్తున్నాయన్నారు. తరతరాలుగా ఏళ్ల తరబడి వేలాదిమంది జీవిస్తున్న ఆ పేటలో కేవలం 30 సెంట్ల భూమి మాత్రమే శ్మశానవాటికకు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కెవిపిఎస్ పోరాట ఫలితంగా జిఒ 1235 ప్రకారం జనాభాతో సంబంధం లేకుండా ప్రతి దళిత పేటకూ రెండెకరాల శ్మశానవాటికను కేటాయించాల్సి ఉందని తెలిపారు. అయినా అర్ధవరంలో శ్మశానవాటిక కేటాయింపునకు అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. భూమిని కేటాయించడానికి అవకాశం ఉన్నా సరే దళితులనే చిన్న చూపుతోనే ఆ పేటకు భూమి కేటాయించడం లేదని విమర్శించారు. స్థలం కేటాయించకపోతే ఎవరైనా మృతి చెందితే మృతదేహంతో తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

## ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

ప్రజాశక్తి - వీరవాసరం

తెలుగు భాషా దినోత్సవాన్ని, గుడుగు రామ్మూర్తి జయంతిని వీరవాసరం ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడు జుత్తిగ శ్రీనివాస్ అధ్యక్షతన సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జుత్తిగ శ్రీనివాస్ మాట్లాడుతూ తెలుగు లేనిదే మన జీవితంలో వెలుగు నిండదన్నారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్షులు గుండా రామకృష్ణ, దంత వైద్యులు కళ్యాణి, తెలుగు ఉపాధ్యాయులు పంపన సాయిబాబు, ఆనందరావు, మన్నె వెంకటేశ్వరరావు, బొల్లా విజయలక్ష్మి పాల్గొన్నారు.

## జగన్నాథపురంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - పోడూరు

మండలంలోని జగన్నాథపురం పంచాయతీ పరిధిలోని పుప్పుగుంటలో పోడూరు పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎ.పూజ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఇటీవల కురిసిన వర్షాలకు దోమల నుంచి అంటూ రోగాలు ప్రబలకుండా, ముందు జాగ్రత్త చర్యగా జ్వరాలు ప్రబలకుండ వైద్య శిబిరం ఏర్పాటు చేసి అవసరమైన వారికి మందులు ఇచ్చారు. గ్రామంలో సర్పంచి గుడాల శిరీష చంటి శానిటేషన్ చేయించి దోమల మందు పిచికారీ చేయించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎన్.సుధారాణి, ఎంఎల్‌హెచ్‌పి సంధ్యారాణి, హెల్త్ అసిస్టెంట్ కె.ప్రసాద్ పాల్గొన్నారు.

## ఎస్‌సి, ఎస్‌టి చట్టాలపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

దళితవాడల్లో ఎస్‌సి, ఎస్‌టి చట్టాలపై అవగాహన కల్పించాలని ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్, మానిటరింగ్ జిల్లా కమిటీ సభ్యులు, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు తెన్నేటి జగ్జీవన్ అన్నారు. డిఎస్‌పి సత్యనారాయణమూర్తిని ఆయన క్యాంపు కార్యాలయంలో జగ్జీవన్ సోమవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా సబ్ డివిజన్ పరిధిలోని పలు ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులపై చర్చించారు. దళితవాడల్లో ఎస్‌సి, ఎస్‌టి చట్టాలపై అవగాహన కల్పించాలని, దీనికి అవసరమైన సమావేశాలు దళిత వాడల్లో నిర్వహించాలని జగ్జీవన్ కోరారు. అవగాహన కార్యక్రమాలను స్వచ్ఛంద సంస్థల సహకారంతో ముందుకు తీసుకెళ్తామని కృషి చేయాలని డిఎస్‌పి సత్యనారాయణమూర్తిని జగ్జీవన్ కోరారు. డిఎస్‌పిని కలిసినవారిలో న్యాయవాది జె.సురేష్‌బాబు ఉన్నారు.

## వీధి దీపాలు ఏర్పాటు

ప్రజాశక్తి - పాలకొల్లు

స్థానిక టిడ్కో గృహాల వద్ద వీధి దీపాల సమస్యకు వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపి పరిష్కారం చూపారు. టిడ్కో గృహాల వద్ద వీధి దీపాలు లేకపోవడంతో ఈ సమస్య పరిష్కరిస్తానని గుడాల గోపి ఇటీవల హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు ఎలిఇడి వీధి దీపాలకు రూ.4.56 లక్షల నిధులు కేటాయించారు. టిడ్కో గృహాల వద్ద సోమవారం వీధి దీపాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మన్ యడ్ల తాతాజీ, వైసిపి నాయకులు గుణ్ణం నాగబాబు, పట్టణ అధ్యక్షుడు చందక సత్తిబాబు పాల్గొన్నారు.

## ఎఎంసి ఛైర్మన్‌గా రసూల్‌బిబి

ప్రజాశక్తి - ఆకివీడు

వైసిపి నాయకుడు షేక్ హుస్సేన్ భార్య షేక్ రసూల్ బిబి ఎఎంసి ఛైర్మన్‌గా పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. సుమారు ఎనిమిది నెలల నుంచి ఖాళీగా ఉన్న ఈ పదవిని ఎట్టకేలకు ప్రభుత్వం నోటిఫికేషన్ ద్వారా పూరించింది. ఆ మేరకు రసూల్ బిబిని ఛైర్మన్‌గాను, కాళ్ల మండలానికి చెందిన ఆనందరావును వైస్‌ఛైర్మన్‌గాను నియమిస్తూ మూడు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులు వచ్చిన మరో గంటలోనే రసూల్ బిబి వైసిపి నియోజకవర్గ కన్వీనర్ డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు కార్యాలయంలో ఎఎంసి రికార్డుల్లో అధికారికంగా సమెూదై సంతకాలు చేశారు. స్థానిక మార్కెట్ యార్డ్ కార్యాలయంలో పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, మాజీ కన్వీనర్ గోకరాజు రామరాజు, క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

కాళ్ల : ఆకివీడు ఎఎంసి డైరెక్టర్ పదవిని పదమట సుబ్బయ్యకు కేటాయించడం అభినందనీయమని గ్రామ సర్పంచి భూపతిరాజు వెంకటజగ్గరాజు అన్నారు. ఆకివీడు మండలంలో జరిగే ఎఎంసి డైరెక్టర్ల ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఏలూరుపాడు గ్రామం నుంచి మోటార్‌సైకిల్ ర్యాలీగా పదమట సుబ్బయ్య బయలుదేరారు. ఎంపిటిసి సభ్యులు చిన్నపురెడ్డి రాంబాబు, వైసిపి గ్రామ అధ్యక్షులు దాట్ల శ్రీనివాసరాజు, వైసిపి నాయకులు మండల రామకృష్ణంరాజు, కొండా రమణ, పెన్మెత్స శ్రీను, పదమట సతీష్, కోనా రంజిత్ పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

మండలంలోని రుస్తుంబాద గ్రామంలో 2.6 కోట్లతో నిర్మించే రాపిడ్ ఫిల్టర్ బెడ్ యూనిట్, పైప్‌లైన్ నిర్మాణ పనులకు రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ఇచ్చి స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. నియోజవర్గంలో ఉన్న ఆర్‌సిపిడబ్ల్యుఎస్ పథకం నిర్వహణ ప్రభుత్వమే భరిస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, జెడ్‌పిటిసి సభ్యులు బొక్క రాధాకృష్ణ, వైస్ ఎంపిపి ఉంగరాల రమేష్‌నాయుడు పాల్గొన్నారు.

# నేరాలు - ఘోరాలు

## పెర్కిపాలెంలో బాలుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - వీరవాసరం

మండలంలోని పెర్కిపాలెం గ్రామానికి చెందిన లంకా సత్యసాయి(12) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వీరవాసరం ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్న సత్యసాయి సోమవారం సాయంత్రం స్కూల్ విడిచిపెట్టిన తరువాత ఇంటికి వచ్చి గదిలో చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అదే స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న సత్యసాయి అక్క ధృవణకృతి ఇంటికి వచ్చేసరికి సత్యసాయి ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. ఆమె ఇంటి పక్కనున్న వారిని పిలవడంతో వారు వచ్చి బాలుడును కిందికి దింపారు. తాపీపనికి వెళ్లిన తండ్రి లంకా సుబ్రహ్మణ్యానికి, కూలి పనికి వెళ్లిన తల్లి సుబ్బలక్ష్మికి సమాచారం అందించడంతో వారు హుటాహుటిన ఇంటికి వచ్చి తన కుమారుడిని వీరవాసరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి మోటర్ సైకిల్‌పై తీసుకెళ్లారు. వెంటనే అక్కడ ఆరోగ్య సిబ్బంది సిపిఆర్ చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. మృతుడు సత్యసాయి ఇంటి నుంచి రూ.వెయ్యి స్కూల్‌కు తీసుకెళ్లినట్లు సమాచారం. తాను పట్టికెళ్లిన డబ్బులను సహచర విద్యార్థులకు ఖర్చు చేస్తుండగా డబ్బుల విషయమై సత్యసాయిని ఎక్కడవి అంటూ ఆరాతీస్తూ ఇంటివద్ద చెబుతామంటూ హెచ్చరించారు. ఈ విషయం తల్లితండ్రులకు తెలిస్తే ఎక్కడ మందలిస్తారోనని భయపడి సత్యసాయి ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని భావిస్తున్నారు. సుబ్రహ్మణ్యం, సుబ్బలక్ష్మి దంపతులకు ముగ్గురు సంతానం ఉన్నారు. పెద్ద కుమార్తెకు పెళ్లి చేయగా రెండో కుమార్తె ధృవణకృతి పదో తరగతి చదువుతుంది. ఇద్దరి ఆడపిల్లల తరువాత మూడో సంతానంగా సత్యసాయి పుట్టడంతో ఇంట్లో అల్లారు ముద్దుగా పెంచుకుంటున్నారని, నెమ్మదస్తుడుగా ఉంటాడని స్థానికులు చెబుతున్నారు. సత్యసాయి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## వివాహం కావడం లేదని..

ప్రజాశక్తి - పెనుమంట్ర

తనకు వివాహం కావడంలేదనే మనస్తాపంతో మద్యానికి బానిసైన ఒక యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మార్టేరుకు చెందినకర్రి లక్ష్మణ్ రెడ్డి, ధనలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు లవ్‌కుమార్‌నర్సిరెడ్డి (24) ఉన్నారు. వారి ఇద్దరి కుమార్తెలకు వివాహం చేశారు. లవ్‌కుమార్ తండ్రి లక్ష్మణ్‌రెడ్డి ఐదేళ్ల క్రితం మృతి చెందాడు. ఈ క్రమంలో లవ్‌కుమార్ తాపీ పని చేస్తుండేవాడు. అతను మద్యానికి బాగా బానిసయ్యాడు. ఈ క్రమంలో ఈ నెల 28వ తేదీ ఉదయం 11 గంటల సమయంలో తన తల్లి ధనలక్ష్మి కూరగాయలు తీసుకురమ్మని చెప్పడంతో తీసుకొచ్చి ఆమెకు ఇచ్చి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తిరిగి రాకపోవడంతో తల్లి పలుమార్లు ఫోన్ చేసినా ఎత్తలేదు. అతని కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం కోడిపందేల దిబ్బ వద్ద లవ్‌కుమార్ మృతదేహాన్ని ఒక రైతు గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించాడు. ఆదివారం సాయంత్రం పురుగుల మందు దుకాణం వద్ద కలుపు మందు కొనుగోలు చేసినట్లు జేబులో రశీదు ఉంది. తనకు వివాహం కాలేదనే మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడని స్థానికులు చెబుతున్నారు. సిఐ నాగేశ్వరరావు, ఎస్ఐ బి.సురేంద్రకుమార్ తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లుతెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

## అడిగినవారందరికీ ఉపాధి హామీ పని కల్పించాలి

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

అడిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కౌరు పెద్దిరాజు డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం నరసాపురం మండలస్థాయి శిక్షణ తరగతులు సోమవారం వేములదీవి గోందుమూల సెంటర్‌లో జరిగాయి. ఈ తరగతులకు ప్రిన్సిపల్‌గా మండల కార్యదర్శి గుబ్బల నాగేశ్వరరావు వ్యవహరించారు. ఈ తరగతుల్లో వ్యవసాయ రంగంలో మార్పులు, ఉపాధి హామీ రక్షణ సంఘ నిర్మాణం అంశాలను జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాతిరెడ్డి జార్జి, జక్కంశెట్టి సత్యనారాయణ బోధించారు. ఈ సందర్భంగా వారు ఇరువురు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయంలో పనులు లేక ఇబ్బంది పడుతున్న కూలీలకు పనులు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మీనవేషాలు లెక్కిస్తున్నాయన్నారు. ఈ శిక్షణ తరగతుల ప్రారంభ సూచికగా సంఘ పతాకాన్ని సీనియర్ నాయకులు కృష్ణమూర్తి ఆవిష్కరించారు. ఈ శిక్షణా తరగతుల్లో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు, సిఐటియు నాయకులు బొక్క శ్రీనివాసరావు, రైతు సంఘం నాయకులు గుత్తుల శ్రీరామచంద్రుడు, మత్స్య కార్మిక సంఘం నాయకులు జల్లి రామ్మోహన్‌రావు, వడుగు నాగలక్ష్మి పాల్గొన్నారు.

## లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. జిల్లా కలెక్టరేట్ నుంచి గృహ నిర్మాణం, ప్రభుత్వ భవనాలు, జాతీయ ఉపాధి హామీ చట్టం, జిజిఎంపి, చేయూత గ్రౌండింగ్, జగనన్న తోడు, నాడు - నేడు, జిఇఆర్, ఎస్‌డిజిఎస్, టిడ్కో గృహాలు తొమ్మిది అంశాలపై జిల్లాలోని అన్ని మండల అధికారులతో జిల్లా జాయింట్ కలెక్టరు ఎస్.రామ్‌సుందర్‌రెడ్డితో కలిసి కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మండలాల వారీగా ప్రగతిని ఆమె అడిగి తెలుసుకున్నారు. లక్ష్యసాధనలో వెనుక బడిన మండలాలు అధికారులపై జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో ఇప్పటికే పూర్తయిన గృహాల్లో మౌలిక వసతులను గృహ ప్రవేశాలు నాటికి పూర్తి చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## బస్టాండ్ ప్రారంభం

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని యాళ్లవానిగరువులో చెల్లెం సూర్యప్రకాష్‌రావు, కృష్ణమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు, ఎస్‌సి కమిషన్ సభ్యులు చెల్లెం ఆనంద్‌ప్రకాష్ నూతనంగా బస్టాండ్ నిర్మించారు. ఆనంద్‌ప్రకాష్ కుమార్తెలు ప్రణీత, లిఖిత పుట్టినరోజు సందర్భంగా నిర్మించిన బస్టాండ్‌ను బస్టాండ్‌ను వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపి సోమవారం ప్రారంభించారు.

## విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకోవాలి

ప్రజాశక్తి - ఆకివీడు

విద్యార్థులు ఒక లక్ష్యంతో విద్యను అభ్యసించి ఉన్నత స్థితికి చేరుకోవాలని ఎంఎల్‌ఎ రామరాజు ఆకాంక్షించారు. స్థానిక సరోజినీనాయుడు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆయన దాతల సహకారంతో విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు, స్టీల్‌ప్లేట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చినమిల్లిపాడు మాజీ సర్పంచి కటికల యేషయ్యరాజు, టిడిపి గ్రామ అధ్యక్షులు కటికల దీనరాజు, కుటుంబ సభ్యుల సహకారంతో పదో తరగతి బాలికలకు విద్యాసామగ్రి, స్కూల్ బ్యాగులు, 200 భోజనం ప్లేట్లను అందించారు. ఈ సందర్భంగా రామరాజు దాతలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ, మండల నాయకులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## రహదారుల అభివృద్ధిపై దృష్టి

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

ఆర్‌అండ్‌బి రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్, ఎంఎల్‌ఎ ముదునూరి ప్రసాదరాజు ఆర్‌అండ్‌బి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు స్థానిక ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో ఆర్‌అండ్‌బి అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముదునూరి ప్రసాదరాజు మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బంది ఉన్న చోట రహదారులకు మరమ్మతులు చేయాలన్నారు. రహదారి నిర్మాణాలకు సంబంధించి సుమారు రూ.15 కోట్లు మంజూరయ్యాని, టెండర్ల దశ పూర్తి చేసుకుని పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు.

## మల్టీపర్పస్ సెంటర్లను అందుబాటులోకి తీసుకురావాలి

భీమవరం : మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్లు త్వరితగతిన అందుబాటులో తీసుకురావాలని కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ జిల్లా స్థాయి ఇంప్లిమెంటేషన్ స్క్రీనింగ్ కమిటీతో సమావేశమై మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్ల నిర్మాణాలపై చర్చించారు. రానున్న రెండు నెలల్లో ఖరీఫ్ పంట చేతికొస్తుందని, అంతకంటే ముందే గోడౌన్లను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. బిల్లుల మొత్తాలను డిసిసి బ్యాంకు త్వరితగతిన చెల్లించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా కోపరేటివ్ అధికారి ఎం.రవికుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఎ.దుర్గేష్, డిసిసిబి సిఇఒ శ్రీదేవి, నాబార్డ్ ప్రతినిధి టి.అనిల్‌కాంత్, ఆప్కాబ్ డిపిడిఎం తులసీదాస్, పిఎసిఎస్‌ల ప్రతినిధులు, పాల్గొన్నారు.

## ధరల అదుపులో ప్రభుత్వాలు విఫలం : సిపిఎం

ప్రజాశక్తి - ఉండి

సంతకాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు

రోజురోజుకూ విపరీతంగా పెరిగిపోతున్న గ్యాస్, పెట్రోల్, డీజిల్, నిత్యావసర సరుకుల ధరలను అదుపు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ విమర్శించారు. మండలంలోని చెరుకువాడ గ్రామంలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేస్తూ బిజెపి ప్రభుత్వం సామాన్యునికి చేస్తున్న మోసాలను వివరించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో రూ.430 ఉండే గ్యాస్ సిలిండర్ ధర మూడింతలు పెరిగి సామాన్యుని నెత్తిన గుదిబండగా మారిందని విమర్శించారు. నిత్యావసర సరుకుల ధరలు రెండింతలు పెరిగి సామాన్యుల జీవన విధానం కష్టతరమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా సెప్టెంబర్ నాలుగో తేదీ వరకూ వివిధ దశల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలపై ప్రచారం నిర్వహిస్తూ, ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని ఎండగడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ధనికొండ శ్రీనివాస్, నాయకులు చీర్ల శేషు, నిమ్మితి కిషోర్, రుద్రరాజు విజయరామరాజు, చీర్ల శ్రీనివాస్, ఎం.పెద్దింట్లు, పి.నాగేశ్వరరావు, రాము పాల్గొన్నారు.

## 'ఎఎస్ఎన్ఎం'లో డిగ్రీ హానర్స్ కోర్సులకు అనుమతి

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి మూడు డిగ్రీ హానర్స్ కోర్సులకు నాలుగో సంవత్సరం ప్రవేశాలకు కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ వారు అనుమతి ఇచ్చినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో నాలుగో సంవత్సరం డిగ్రీ హానర్స్ ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు చెప్పారు. బిఎస్‌సి కెమిస్ట్రీ, బి.కామ్ (జనరల్), బిఎ (ఎకానమిక్స్) డిగ్రీ ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులని తెలిపారు.

## పెంటపాడులో విద్యుత్ అమరవీరుల వర్ధంతి సభ

ప్రజాశక్తి - పెంటపాడు

పెంటపాడు ప్రజాసంఘాల కార్యాలయంలో సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం విద్యుత్ అమరవీరుల 23వ వర్ధంతి సభ నిర్వహించారు. విద్యుత్ ఉద్యమంలో చనిపోయిన రామకృష్ణ, బాలస్వామి, విష్ణువర్ధన్‌రెడ్డి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి మాట్లాడుతూ 2000 సంవత్సరంలో అప్పుడు అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు ఆదేశాలకు అనుగుణంగా విపరీతంగా కరెంట్ ఛార్జీలు పెంచిందన్నారు. ఈ భారాలను వ్యతిరేకంగా 2000 సంవత్సరంలో వంద రోజులు పోరాటం చేసి చలో హైదరాబాదు వామపక్ష పార్టీలు, అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పిలుపునిచ్చాయన్నారు. చలో అసెంబ్లీకి వెళ్తున్న ప్రజలపైకి భషీరాబాద్ ప్రాంతంలో అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు విచక్షణారహితంగా లాఠీఛార్జి, గుర్రలతో తొక్కించడం, కాల్పులు జరపడం వల్ల ముగ్గురు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోదండ రామిరెడ్డి, కర్రి సాయిరెడ్డి, తాడి బాలయ్య, కర్రి జనార్దన్‌రెడ్డి, కర్రి అమ్మారెడ్డి, తాడి రాజు పాల్గొన్నారు.

## విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు బాలకృష్ణకు సత్కారం



పిసిసి, ఎల్‌సిసి ఆధ్వర్యంలో బాలకృష్ణకు సత్కారం

ప్రజాశక్తి - పాలకోడేరు

జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు పొన్నమండ బాలకృష్ణకు అరుదైన సత్కారం లభించింది. ఇటీవల జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యులుగా నియమితులైన బాలకృష్ణను విస్సాకోడేరు ప్యారిస్ పరిధిలోని ఆరు సంఘాల పిసిసి, ఎల్‌సిసి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సత్కరించారు. గొరగనముడి సెయింట్ జోసెఫ్ లూధరన్ చర్చిలో గురు మండల అధ్యక్షులు పాస్టర్ ఎం.రాజు, డేలిగేట్ రాజశేఖర్, నరసింహం సమక్షంలో సత్కరించారు. ఈ సందర్భంగా పాస్టర్ రాజు మాట్లాడుతూ సమాజంలో దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టేలా కృషి చేయాలని కోరారు. బాలకృష్ణ మాట్లాడుతూ ప్యారిస్ ఆధ్వర్యంలో పిసిసి, ఎల్‌సిసి, సంఘ సభ్యుల సమక్షంలో తనకు సత్కారం లభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు తులసీ చంద్రమోహన్, పాలపర్తి చిన్ని, గోడి రమేష్‌బాబు, పితాని పద్మనాభం, మట్టా రాజేష్, గంటా చిన్నా జయ, కోరం సురేష్, మండ నేహిమియ్య, దుండి ఆనందరావు, దుండి సురేష్, గెడ్డం గమనియేలు, ఏలేటి జయనాథం, రావిజార్జి ముల్లారారావు, కోరం నదికేశ్వరరావు, కోరం వెంకన్న, దీపాటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## 'వైసిపి రజకులలకు చేసింది శూన్యం'

తాడేపల్లిగూడెం : అధికారలంలోకొచ్చాక వైసిపి ప్రభుత్వం రజకులకు చేసిందేమీ లేదని, రజక కార్పొరేషన్‌కు ఒక్క రూపాయి నిధులు కూడా కేటాయించలేదని రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మున్నూరు భాస్కరయ్య అన్నారు. స్థానిక సీతారాంపేట ప్రజా సంఘాల కార్యాలయంలో జిల్లా రజక వృత్తిదారుల సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం కనపర్తి రామకృష్ణ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన భాస్కరయ్య మాట్లాడుతూ రజకుల సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తామని చెప్పారు. అక్టోబర్‌లో రజకుల సమస్యల పరిష్కారానికి ప్రత్యక్ష ఆందోళనకు సిద్ధపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## ఉపాధి హామీ వేతనాల విషయంలో ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

భీమవరం : ఉపాధి హామీ వేతనాలకు ఆధార్, బ్యాంక్ ఖాతా, జాబ్ కార్డ్ నెంబర్ లింక్ పెట్టడం సరికాదని, ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాతిరెడ్డి జార్జి, జక్కంశెట్టి సత్యనారాయణ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధి హామీలో ఇప్పటికే పోస్టాఫీస్ నుంచి బ్యాంకులకు వేతనాలు మార్చిన తర్వాత వేతనాలు అందక ఇబ్బందులు పడుతుంటే ఇప్పుడు గోరుచుట్టుపై రోకలి పోటులా ఆధార్, బ్యాంకు, జాబ్ కార్డు లింక్ అనడం కూలీలను మోసం చేయడమేనన్నారు. ఇప్పటికే ఉపాధి హామీకి నిధులు తగ్గించి యాప్ ద్వారా మస్తర్ రెండు పూటలా పనితో ఉసురు తీస్తోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ విధానాలను వెనక్కి తీసుకోకపోతే రానున్న రోజుల్లో కూలీల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

## మోగల్లు పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

### 'స్పందన'లో గ్రామస్తుల ఫిర్యాదు

ప్రజాశక్తి - పాలకోడేరు

మోగల్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి కనుమూరి వెంకటరాజుపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన జలే సునీత, నేతల శ్యాంకుమార్, కొడమంచిలి క్రాంతిబాబు, మైలాబత్తుల వెంకట్రావుతో పాటు మరో 17 మంది స్పందన కార్యక్రమంలో డిఆర్ఒ కె.కృష్ణవేణికి ఫిర్యాదు చేశారు. మోగల్లు గ్రామ పంచాయితీకి సంబంధించి లావాదేవీలలో అవినీతి, అక్రమాలకు పాల్పడి సొమ్మును తన సొంత ఖాతాకు పంచాయతీ కార్యదర్శి మళ్లించుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పంచాయతీలో జరిగిన అవినీతి అక్రమాలపై మార్చి 25వ తేదీన ఎంపిడిఒకు ఫిర్యాదు చేశామన్నారు. ఏప్రిల్ 11న విచారణ చేపట్టాక ఈ విచారణలో పంచాయతీ కార్యదర్శి వెంకటరాజు పంచాయతీ సొమ్మును తమ సొంత ఖాతా ద్వారా లావాదేవీలు చేస్తున్నట్లు అధికారులు నిర్ధారించారన్నారు. ఇదంతా జరిగి సుమారు నాలుగు నెలలు కావస్తున్నా సంబంధిత పంచాయతీ కార్యదర్శిపై ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. పంచాయితీ కార్యదర్శిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం పట్టణంలో దేవి ఎడ్యుకేషనల్ సొసైటీ మినిస్టరి ఆఫ్ సోషల్ జస్టిస్ సహకారంతో నిర్వహిస్తున్న దీక్ష డ్రగ్ డే అడిక్షన్ సెంటర్ వారు మత్తుమందులు, మద్యం వల్ల కలుగే నష్టాలపై సోమవారం స్థానిక బ్రహ్మానందరెడ్డి కూరగాయల మార్కెట్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆ ప్రాంతంలోని కార్మికులను కలిసి వారికి అవగాహన కల్పించారు. మద్యపానం, గంజాయి వంటి మాదకద్రవ్యాలు అనారోగ్యంతో పాటు సమాజంలో అశాంతిని సృష్టిస్తున్నాయన్నారు. ఈ అలవాట్లు ఉన్నవారిని మాన్పించేందుకు తమ పునరావాస కేంద్రంలో కౌన్సెలింగ్ చికిత్స ఉచితంగా అందిస్తున్నట్లు దేవి ఎడ్యుకేషనల్ సొసైటీ కౌన్సిలర్ శ్రీను వివరించారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను కూరగాయల జట్టు వర్కర్స్ యూనియన్ వారికి పంపిణీ చేశారు. కూరగాయల జట్టు వర్కర్స్ యూనియన్(సిఐటియు) ప్రెసిడెంట్ గొర్రెల సతీష్ మాట్లాడుతూ మద్యం అలవాటు చాలా ప్రమాదకరమని, దానివల్ల కుటుంబాలు నాశనమవుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న దేవి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలోని దీక్ష డ్రగ్ డే అడిక్షన్ సెంటర్‌లో కౌన్సెలింగ్, మందులు ఉచితంగా అందిస్తున్నారని, వాటిని వినియోగించుకుని మన జీవితాలను సంతోషంగా చూసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవి ఎడ్యుకేషనల్ సొసైటీ సభ్యులు కౌన్సిలర్ శ్రీను, ఎడ్యుకేటర్ కృష్ణ పాల్గొన్నారు.

## 'ఆక్వా రైతులను ముంచేసిన సిఎం జగన్'

ఉండి : ఆక్వా రైతులను రాయితీ పేరుతో మోసం చేసి నిలువునా ముంచేసిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని ఎంఎల్‌ఎ మంతెన రామరాజు విమర్శించారు. మండలంలోని కలిగొట్ల గ్రామంలో పార్టీ గ్రామ అధ్యక్షులు రుద్రరాజు సూర్యనారాయణరాజు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో ఎంఎల్‌ఎ రామరాజు పాల్గొని మాట్లాడారు. పాదయాత్రలో జగన్మోహన్‌రెడ్డి ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్ ధర రూ.1.50 పైసలకు ఇస్తానని ఇచ్చిన హామీని కొంతకాలం వర్తింపజేసి తర్వాత ఆక్వాజోన్, నాన్ ఆక్వా జోన్ అని విభజించడంతో ఆక్వా రైతులు నిండా మునిగారన్నారు. కేసుల గురించి భయపడి ఆక్వా ఎక్స్‌పోర్ట్ ఇన్సెంటివ్ గురించి కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిలదీయడంలేదన్నారను. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి మాదిరెడ్డి సూర్యసత్యనారాయణ, ఉండి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు, కాళ్ల మండల అధ్యక్షులు గుండాబత్తుల నాగేశ్వరరావు, పాలకోడేరు మండల అధ్యక్షులు దెందుకూరి ఠాగూర్ కోటేశ్వరరాజు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వెంకటేశ్వరరాజు పాల్గొన్నారు.

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఇ.పి.నెం. 79/2022
ఇన్
ఓ.యస్.నెం. 42/2017
బిట్వీన్:
కోటబోయిన కాసులు ...డి.హెచ్.ఆర్
మరియు
ఈపి మురళి ...జె.డి.ఆర్
పై నెంబరు గ్రంధములో డి.హెచ్.ఆర్. గారు శ్రీ కోర్టు వారి ద్వారా మిమ్ములను కోర్టు వారి ఎదుట హాజరు కావాలని పలుమార్లు కోర్టు వారి ద్వారా నోటీసులు పంపినప్పటికీ మీరు కోర్టు నోటీసులు తీసుకొనకుండా ఉద్దేశ్యపూర్వకముగా కాలయాపన చేయుచున్నారు అనిన్నీ, కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది.04-09-2023వ తేదీ నాటికి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా కాని హాజరు అయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోవలయును.** లేని ఎడల పై పిటీషను మీ పరోక్షమున తీర్మానించబడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
గొల్లపూడి వెంకట ద్వారకానాథ్
న్యాయవాది, తాడేపల్లిగూడెం.
సెల్: 93464 84736

తణుకు పురపాలక సంఘం
ఆర్.ఓ.సి.నెం. ODW/01/95/2023/ఇ1 తేది.28-08-2023
టెండరు నోటీసు
తణుకు పురపాలక సంఘ పరిధిలో ఈ దిగువ తెల్పిన పనులకు ఇ-ప్రొక్యూర్ మెంటు ద్వారా టెండర్లు పిలువబడుచున్నవి.

| | | ఇ.సి.వి.(రూ.లక్షలలో) |
|---|---|---|
| 1) 4 వీలర్ వాహనము (కారు) అద్దె ప్రాతిపదికన ఏర్పాటు చేయుట | 1 నెం. | 4.20 |
| 2) రోడ్డు పనులు | 2 నెం.లు | 13.18 |
| 3) డ్రయిను పనులు | 5 నెం.లు | 18.66 |
| 4) వాటర్ సప్లయి పనులు | 1 నెం.లు | 4.16 |
| 5) ఎలక్ట్రికల్ పనులు | 1 నెం. | 10.69 |

సంబంధిత వివరములకు www.apeprocurement.gov.in వెబ్‌సైట్ నందు ది.29-08-2023వ తేదీ నుండి చూడవచ్చును.
సం/- కమీషనర్, తణుకు పురపాలక సంఘం

## రైస్ కార్డులు అందజేత

ప్రజాశక్తి - వీరవాసరం

ఇటీవల కొత్తగా మంజూరైన రైస్ కార్డులను వీరవాసరం పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచి చికిలే మంగతాయారు లబ్ధిదారులకు సోమవారం అందించారు.వీరవాసరం పరిధిలో మొత్తం 37 రైస్ కార్డులు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యకరమంలో శ్రీసీతారామ దేవస్థానం ఛైర్మన్ పాలా నాగరాజు, వార్డు సభ్యుడు బందిల సునీల్‌కుమార్, ఎఎంసి డైరెక్టర్ మతల కాశీ, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## వాలంటీర్ల సేవలు అభినందనీయం : గ్రంథి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

వాలంటీర్ల సేవలు అభినందనీయమని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలో నూతనంగా ఎంపికైన 30 మంది వాలంటీర్లకు ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ ఆయన సోమవారం ఆయన క్యాంపు కార్యాలయంలో నియామక పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఎంపికైన వాలంటీర్లు ప్రజా సేవలో నిమఘ్నమవ్వాలని సూచించారు. కేటాయించిన కుటుంబాలవారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వారి అర్హతను బట్టి అందించేలా కృషి చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను తెలుసుకుని, ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, భీమవరం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు పేరిచర్ల సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

## 30న మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఈ నెల 30వ తేదీన స్థానిక సవిత్రపేటలో మార్నిడి వెంకన్న నివాసం వద్ద ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు చైతన్య ఎమర్జెన్సీ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ సోమేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బిపి, షుగర్, థైరాయిడ్, గుండె, ఊపిరితిత్తులు తదితర రోగాలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. పట్టణ, పరిసర గ్రామాల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## అంతిమ సంస్కారాల కోసం ఉచిత వాహనం

పెనుమంట్ర : అంతిమ సంస్కారాల కోసం ఆలమూరు కేంద్రంగా టాటా ఎసి వాహనాన్ని అందుబాటులో ఉంచినట్లు సత్తి చిరంజీవి రెడ్డి అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద సత్తి చిరంజీవి తండ్రి సత్యనారాయణ రెడ్డి జ్ఞాపకార్థంగా ఏర్పాటు చేసిన టాటా ఎసి వాహనాన్ని తల్లి సుగుణ చేతుల మీదుగా సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చిరంజీవి రెడ్డి మాట్లాడుతూ వాహనాన్ని ఎవరైనా ఉచితంగా వినియోగించుకోవచ్చని తెలిపారు. మండలంలో ఏ గ్రామం నుంచి ఏ ప్రాంతానికైనా సరే ఆలమూరు కేంద్రంగా అందుబాటులో ఉంటుందని చెప్పారు.

మహారాజశ్రీ అమలాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్.నెం. 174/2017
బిట్వీన్:
ముదునూరి వెంకట సోమరాజు ...వాది
అండ్
పెన్మెత్స వెంకట కృష్ణంరాజు ...ప్రతివాది
టు: పెన్మెత్స వెంకట కృష్ణం రాజు, తండ్రి: రామచంద్రరాజు, ప్లాట్ నెం.101, వినాయక మారుతి రెసిడెన్సీ 4వ వీధి, డో.నెం.1-12-1/2, ఆర్.కె.ఆదర్శ్ నగర్, భీమవరం, ప॥గో॥జిల్లా.
ఈ పై నెంబరు దావాను వాది మీపై మీరు వ్రాయించి ఇచ్చిన ప్రామిసరీ నోటు బాకీ అసలు ఫాయిదాలు తాలూకు వసూలు మున్నగు పరిహారములు కోరుచూ దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు సమన్లు నిమిత్తం మరియు మీ హాజరు నిమిత్తం వాయిదా **ది.01-9-2023వ తేదీ అయి ఉన్నది. కావున మీరు వాయిదా రోజున ఉదయం గం॥10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేట్ వారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను.** అట్లు కాని ఎడల మీ పరోక్షమందున తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.
(శ్రీ కోర్టు వారి అనుమతితో)
శ్రీ కుచ్చర్లపాటి తాతంరాజు
శ్రీ గుత్తుల శ్రీనివాసరావు
అమలాపురం, అడ్వకేట్స్, ముమ్మిడివరం.
25-8-23. సెల్: 94400 41751

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P.No.07/2023
in O.S.No. 172/2018
D.H.R.:
Bandi Venkatesulu, S/o. Narasayya, Tadepalligudem.
J.D.R.:
Dirsipo Prasad, S/o. Veeranna, Moduggunta Village.
పై నెంబరు డిక్రీ బాకీకి గాను జె.డి.ఆర్. తాలూకు ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్థి **ది.14-09-2023వ సం॥రం తేదీన ఉదయం గం॥10:30 ని॥ల లగాయితూ పై కోర్టులో వేలం వేయబడును.** కావున కావలసిన వారు వచ్చి పాట షరతులు తెలుసుకొని పాడుకొనవచ్చును.
షెడ్యూలు
West Godavari District, Tadepalligudem Mandal with in the SRO of Tadepalligudem, in Madhavaram Village in R.S.No. 150/2k/1 (Old R.S.No.150/2) an extent of Ac.0.21 cents (in Ac. 1.07 1/4 in Pura Ac.1.85 cents) land with in the following boundaries.
East: Land belonged to Maganti Basavayya. South: Land belonged to Kanneboyina Surya Rao. West: Land belonged to Dirsipo Danayya. North: Land belonged to Undrajavarapu Maani.
Within the above boundaries the above extent of Ac.0.21 Cents of land with all easementary rights there in.
**Petitioner /DHR Value : Rs.2,00,000/-**
**Amin Value : Rs.4,20,000/-**
డి.ధర్మరాజు
డి.హెచ్.ఆర్. తరుపు అడ్వకేట్
తాడేపల్లిగూడెం.